నైజీరియా సంచలనం

న్యూజిలాండ్‌పై అనూహ్య విజయం

ఐసీసీ అండర్-19 ఉమెన్స్ వరల్డ్‌కప్

కుచింగ్ (మలేషియా): ఐసీసీ అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో సోమవారం పెను సంచలనం నమోదైంది. పసికూన నైజీరియా.. పటిష్ట న్యూజిలాండ్‌ను ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో నైజీరియా 2 పరుగుల తేడాతో గెలిచింది. తొలిసారి ప్రపంచకప్ ఆడుతున్న ఆ జట్టుకు అంతర్జాతీయ స్థాయిలో ఇదే మొదటి విజయం కావడం విశేషం. వర్షం అంతరాయం వల్ల 13 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నైజీరియా 6 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. ఆ జట్టులో కెప్టెన్ లక్కీ పీటి (19), లిలియన్ ఉడె (18) రెండంకెల స్కోరు చేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో కివీస్ అమ్మాయిలు.. 13 ఓవర్లలో 63/6 మాత్రమే చేయగలిగారు. ఛేదనలో భాగంగా 11 ఓవర్లలో 49/5గా ఉన్న న్యూజిలాండ్.. చివరి రెండు ఓవర్లలో విజయానికి 17 పరుగులు అవసరం కాగా 12వ ఓవర్లో 8 పరుగులు రాబట్టింది. ఆఖరి ఓవర్లో 9 పరుగులు అవసరముండగా ఆ జట్టు 6 పరుగులు మాత్రమే చేయడంతో నైజీరియా చరిత్రాత్మక విజయం సాధించింది. గ్రూప్-సీలో సౌతాఫ్రికా తర్వాత నైజీరియా రెండో స్థానంలో ఉండటంతో ఆ జట్టు సూపర్ సిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మిగిలిన మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా.. బంగ్లాదేశ్‌ను ఓడించగా ఐర్లాండ్‌పై యూఎస్ఏ, పాకిస్థాన్‌పై ఇంగ్లండ్, నేపాల్‌పై స్కాట్లాండ్, సమోవాపై సౌతాఫ్రికా విజయాలు సాధించాయి.

భారత్ X మలేషియా పోరు నేడు

ప్రపంచకప్‌లో భాగంగా డిఫెండింగ్ చాంపియన్ భారత్.. మంగళవారం మలేషియాతో మ్యాచ్ ఆడనుంది. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను చిత్తుచిత్తుగా ఓడించిన టీమ్‌ఇండియా..

మలేషియానూ భారీ తేడాతో ఓడించి సూపర్-6 బెర్తును ఖాయం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇక శ్రీలంకతో ఆడిన తొలి మ్యాచ్‌లో 23 పరుగులకే ఆలౌట్ అయిన ఆతిథ్య మలేషియా.. జోరు మీదున్న భారత్‌కు ఏ మేరకు పోటీనిస్తుందో చూడాలి.

రంజీ బాటలో రోకో

దేశవాళీ వైపు మళ్లుతున్న స్టార్ క్రికెటర్లు ● బీసీసీఐ ఆదేశాలతో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం

ముంబై: జాతీయ జట్టులో కొనసాగాలంటే దేశవాళీలు ఆడాల్సిందేనని కరాఖండీగా చెప్పిన బీసీసీఐ ఆదేశాలను భారత స్టార్ క్రికెటర్లు ఆచరణలో పెడుతున్నారు. సుమారు దశాబ్దకాలంగా డొమెస్టిక్ క్రికెట్ వైపునకు కన్నెత్తి చూడని టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ, రన్ మిషీన్ విరాట్ కోహ్లీ దేశవాళీ బాట పట్టారు. పదేండ్ల తర్వాత హిట్‌మ్యాన్‌తో పాటు కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడనున్నారు. త్వరలో జమ్ముకశ్మీర్‌తో జరుగబోయే రంజీ మ్యాచ్‌లో అతడు తన రాష్ట్ర జట్టు ముంబైకి ప్రాతినిధ్యం వహించనున్నాడు. హిట్‌మ్యాన్‌తో పాటు యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ సైతం ముంబై ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో ఉన్నారు. అజింక్యా రహానే సారథిగా వ్యవహరించనున్న ముంబై జట్టు ఈనెల 23 నుంచి జమ్ముకశ్మీర్‌తో మ్యాచ్ ఆడనుంది. సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా.. సౌరాష్ట్ర తరఫున ఆడనుండగా రిషభ్ పంత్ ఢిల్లీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఏడేండ్ల తర్వాత పంత్ దేశవాళీలు ఆడనున్నాడు. ఈ మ్యాచ్ కోసం ప్రకటించిన 22 మంది సభ్యుల జట్టులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేరున్నప్పటికీ అతడు మెడ నరాల నొప్పితో రంజీ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. కానీ ఈనెల 30న ఢిల్లీ.. రైల్వేస్‌తో ఆడబోయే మ్యాచ్‌లో కోహ్లీ బరిలోకి దిగబోతున్నాడు. ఈ విషయాన్ని డీడీసీఏ అధ్యక్షుడు రోహన్‌జైట్లీతో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టికి కోహ్లీ తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో 2012 తర్వాత తొలిసారి ఈ స్టార్ బ్యాటర్ దేశవాళీలో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఇక హైదరాబాదీ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్, పంజాబ్ తరఫున శుభ్‌మన్ గిల్ సైతం వారి జట్లకు ఆడేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

సాత్విక్ జోడీ పుంజుకునేనా?

నేటి నుంచే ఇండోనేషియా ఓపెన్

జకర్తా: ఈ ఏడాది తొలి టైటిల్ వేటలో ఉన్న భారత స్టార్ షట్లర్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం మరో బీడబ్ల్యూఎఫ్ టోర్నీకి సిద్ధమైంది. జకర్తా వేదికగా మంగళవారం నుంచి ఇండోనేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌కు తెరలేవనుంది. ఈ ఏడాది మలేషియా ఓపెన్, ఇండియా ఓపెన్ తర్వాత జరుగనున్న ఈ టోర్నీలో ప్రపంచ 9వ ర్యాంకు భారత జోడీ సెమీస్ గండాన్ని (గత రెండు ఈవెంట్లలోనూ సెమీస్‌లో ఓడారు) దాటాలని పట్టుదలతో ఉంది. భారీ అంచనాలతో ఇండియా ఓపెన్ మహిళల సింగిల్స్ బరిలోకి దిగిన పీవీ సింధు.. స్వదేశంలో నిరాశపరచినా ఇక్కడైనా పుంజుకోవాలని భావిస్తోంది. సింధుతో పాటు మాళవిక, ఆకర్షి, అనుపమ బరిలో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, రజావత్ ఏ మేరకు సత్తా చాటుతారో చూడాలి. స్వల్ప విరామం తర్వాత కిదాంబి శ్రీకాంత్ ఈ టోర్నీలో ఆడనున్నాడు. అయితే అతడు మెయిన్ డ్రాకు అర్హత సాధించలేదు. శ్రీకాంత్‌తో పాటు కిరణ్ జార్జి సైతం అర్హత రౌండ్ల ద్వారా ఈ టోర్నీ బరిలో నిలిచారు. మహిళల డబుల్స్ భారాన్ని అశ్విని-తనీషా మోయనున్నారు.

క్వార్టర్స్‌కు స్వియాటెక్

సిన్నర్ జోరు ● రిబాకినా ఔట్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో పోలండ్ భామ ఇగా స్వియాటెక్ జోరు కొనసాగిస్తోంది. ప్రత్యర్థికి ఒక్క సెట్ కాదు కదా.. కనీసం ఒక్క గేమ్ కూడా గెలవనీయకుండా ఆడుతున్న ఆమె ప్రిక్వార్టర్స్‌లోనూ అదే దూకుడును ప్రదర్శించింది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ స్వియాటెక్ 6-0, 6-1తో ఎవా లిస్ (జర్మనీ)ని మట్టికరిపించింది. 59 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన ఈ పోలండ్ ప్లేయర్.. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ వరుస సెట్లలో ప్రత్యర్థిని చిత్తు చేసి మ్యాచ్‌లను సొంతం చేసుకోవడం విశేషం. గత రెండు మ్యాచ్‌లలోనూ ఆమె రదుకాను, స్రమ్కోవాలపైనా 6-0తేడాతో సెట్‌లను గెలుచుకున్న విషయం విదితమే. మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ ఎలీనా రిబాకినా(కజకిస్థాన్).. 3-6, 6-1, 3-6తో మాడిసన్ (యూఎస్) చేతిలో ఓడింది. స్వితోలినా, నవర్రో క్వార్టర్స్ చేరారు.

సిన్నర్ జోష్:

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సిన్నర్ క్వార్టర్స్ చేరాడు. నాలుగో రౌండ్‌లో ఈ ఇటలీ కుర్రాడు 6-3, 3-6, 6-3, 6-2తో హోల్గర్ రూణె (డెన్మార్క్)తో పోరాడి గెలిచాడు. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన మ్యాచ్‌లో రెండో గేమ్ గెలిచినప్పటికీ రూణె ఆ జోరు కొనసాగించక చతికిలపడ్డాడు. 8వ సీడ్ అలెక్స్ డి మినార్, బెన్ షెల్టన్, లొరెంజో సొనెగొ క్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

ఏషియన్ పారా ట్రోబాల్ టోర్నీకి కృష్ణవేణి

హనుమకొండ చౌరస్తా, జనవరి 20 : కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ విభాగ పరిశోధక విద్యార్థిని ఎం కృష్ణవేణి.. మార్చి 28 నుంచి 30 వరకు కాంబోడియాలో జరిగే తొలి ఏషియన్ పారా ట్రోబాల్ టోర్నీకి ఎంపికైంది. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ దివ్యాంగుల విభాగం సెల్ సంచాలకుడు డాక్టర్ ఏ రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారా ట్రోబాల్ టోర్నీలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించబోతున్న కృష్ణవేణిని యూనివర్సిటీ వీసీ కే ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అభినందించారు.

లక్నో సారథిగా పంత్

కోల్‌కతా: కొద్ది రోజుల క్రితమే ముగిసిన ఐపీఎల్ మెగా వేలంలో రికార్డు ధర (రూ.27 కోట్లు) దక్కించుకున్న యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్.. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) సారథిగా నియమితుడయ్యాడు. ఈ మేరకు ఎల్ఎస్‌జీ యజమాని సంజీవ్ గొయెంకా.. సోమవారం కొత్త సారథిని అధికారికంగా ప్రకటించాడు. కొత్త ఆశలు, ఆకాంక్షలతో ఈ సీజన్‌ను ప్రారంభించబోతున్నామని చెబుతూ.. పంత్‌ను 'ఇదిగో ఇతడే మా కొత్త సారథి' అని పాత్రికేయులకు పరిచయం చేశాడు. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు సారథిగా పనిచేసిన అనుభవమున్న పంత్‌కు కెప్టెన్‌గా ఇది రెండో జట్టు. ఈ సందర్భంగా పంత్ మాట్లాడుతూ.. 'నా మీద మీరు ఉంచిన నమ్మకానికి అనుగుణంగా నేను నిబద్ధతగా నడుచుకుంటా. లక్నోకు సారథిగా వ్యవహరించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని అన్నాడు. జాతీయ జట్టులో సీనియర్ ఆటగాళ్లు, సారథుల నుంచి తాను ఎంతగానో నేర్చుకున్నానని, ఆ అనుభవం ఐపీఎల్‌లో ఉపయోగపడుతుందని పంత్ తెలిపాడు.

చికితకు స్వర్ణం

రాష్ట్ర జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్(డీపీఎస్) వేదికగా రాష్ట్ర జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ హోరాహోరీగా సాగాయి. ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో దాదాపు 200 మందికి పైగా ఆర్చర్లు పోటీపడ్డారు. కాంపౌండ్ విభాగంలో పెద్దపల్లికి చెందిన చికితారావు 697 పాయింట్లతో పసిడి పతకంతో మెరిసింది. ఇదే కేటగిరీలో మానసకు రజతం, శ్రేష్ఠారెడ్డి కాంస్యం దక్కించుకున్నారు. జాతీయ ట్రయల్స్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి ప్రతిష్ఠాత్మక ఆర్చీర ప్రపంచకప్‌నకు ఎంపికైన చికితను రాష్ట్ర ఆర్చరీ సంఘం అధ్యక్షుడు రాజు, డీపీఎస్ కరస్పాండెంట్ పవన్‌కల్యాణ్ సన్మానించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో డీపీఎస్ అకాడమీ ద్వారా మెరికల్లాంటి ఆర్చర్లను అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ చైర్మన్ భీమ్‌సేన్, వైస్‌చైర్మన్ ప్రణయ్‌కుమార్, ఆర్చరీ సంఘం కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రింకూ, ప్రియా పెండ్లి ఫిక్స్

న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ రింకూసింగ్, యువ ఎంపీ ప్రియా సరోజ్ పెండ్లి కుదిరింది. గత కొన్ని రోజులుగా పెండ్లిపై వస్తున్న వార్తలకు ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు స్పష్టత ఇచ్చారు. 'రింకూ, ప్రియా పెండ్లి ఖరారైంది. ఇప్పటికైతే ఎలాంటి శుభకార్యం జరుగలేదు. పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా ప్రియా ప్రస్తుతం తిరువనంతపురం పర్యటనలో ఉంది. మరోవైపు ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో రింకూ బిజీగా ఉన్నాడు. ఇద్దరి అనుకూలంగా ఉండే తేదీల కోసం చూస్తున్నాం. నిశ్చితార్థం తేదీ కూడా ఇంకా ఖరారు కాలేదు. ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు మాట్లాడుకుని ఒక నిర్ణయానికి వస్తాం' అని ప్రియా తండ్రి తూఫానీ సరోజ్ పేర్కొన్నారు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ ద్వారా రింకూ ఒక్కసారిగా వార్తల్లో వ్యక్తిగా నిలువగా, 25 ఏండ్ల వయసులోనే ప్రియా సరోజ్ లోక్‌సభ ఎంపీగా ఎన్నికైంది.

చిత్రం

మహాశివుడి ఆనందతాండవం

శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా మంచు విష్ణు కథానాయకుడిగా తెరకెక్కిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో బాలీవుడ్ అగ్ర నటుడు అక్షయ్ కుమార్ శివుడి పాత్రను పోషిస్తున్నారు. సోమవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అక్షయ్‌కుమార్ తన సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. ఇందులో త్రిశూలం చేతబూనిన మహాశివుడు ఆనందతాండవం చేస్తూ కనిపిస్తున్నారు. ఇలాంటి అద్భుతమైన చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని, శివుడి ఆశీస్సులతో సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తున్నామని అక్షయ్ కుమార్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్, బ్రహ్మానందం, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. భారీ వ్యయంతో మోహన్‌బాబు మంచు రూపొందిస్తున్నారు.

'సత్య' మీద ప్రమాణం చేసి చెబుతున్నా..

'ఏ సత్య కన్ఫెషన్ టూ మై సెల్ఫ్' అనే హెడ్డింగ్‌తో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 27 ఏళ్ల తర్వాత ఈ మధ్యే 'సత్య' సినిమా చూసినప్పుడు భావోద్వేగంతో కన్నీళ్లొచ్చాయని, అలాంటి గొప్ప సినిమా తీసిన తాను గత కొంతకాలంగా ప్రేక్షకుల నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయానని ఆర్జీవీ తన పోస్ట్‌లో ఆవేదన చెందారు. సత్య, రంగీలా సినిమాలు అందించిన విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని, ఆ విజయాల వెలుగులో కళ్లుమూసుకుపోయిన తాను ఇష్టం వచ్చినట్లు సినిమాలు తీశానని ఆయన చెప్పుకొచ్చారు. 'గత కొన్నేళ్లుగా నాకున్న తెలివితేటలతో గిమ్మిక్కులు ప్రదర్శించి అర్థపర్థం లేని కంటెంట్‌తో సినిమాలు తీశా. నా ప్రతిభకు తగిన విధంగా ఇండస్ట్రీ ఎన్నో అవకాశాలను కల్పించింది. అయినా నేను వాటిని ఉపయోగించుకోలేదు. నా తప్పుల్ని కూడా సరిదిద్దుకోలేకపోయాను. అందుకే రెండు రోజుల క్రితం ఓ ప్రతిజ్ఞ చేసుకున్నా. ఇక నుంచి నేను డైరెక్ట్ చేసే ప్రతీ సినిమా దర్శకుడిగా నా స్థాయిని పెంచేలా ఉండాలని నిర్ణయించుకున్నా. ఇక నా మిగిలిన జీవితాన్ని నిజాయితీగా గడుపుతూ, 'సత్య' స్థాయి ప్రమాణాలు కలిగిన గొప్ప సినిమాలు తీయాలనుకుంటున్నా. ఇది 'సత్య' మీద నేను చేస్తున్న ప్రమాణం' అంటూ రామ్‌గోపాల్‌వర్మ తన సుదీర్ఘ పోస్ట్‌లో పేర్కొన్నారు.

విజయ్ సినిమా డేట్ మారిందా?

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. 'వీడీ 12' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 28న విడుదల చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. తాజా సమాచారం ఈ సినిమా మే 30న ప్రేక్షకుల ముందుకురాబోతున్నట్లు తెలిసింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు', మ్యాడ్‌స్క్వేర్ చిత్రాలు వరుసగా మార్చి 28, 29 తేదీల్లో రిలీజ్ కానున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ సినిమా రిలీజ్ డేట్‌ను రీషెడ్యూల్ చేశారని వార్తలొస్తున్నాయి. ఈ విషయంలో చిత్ర బృందం నుంచి త్వరలో అధికారిక ప్రకటన రానుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తీయబోతున్నామని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఇటీవలే తెలియజేశారు. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి సినిమాపై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి.

నటుడు విజయ రంగరాజు కన్నుమూత

సినీ నటుడు విజయ రంగరాజు అలియాస్ రాజ్‌కుమార్ (69) సోమవారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. వారం క్రితం హైదరాబాద్‌లో ఓ సినిమా షూటింగ్‌లో గాయపడ్డ రంగరాజు చికిత్స కోసం చెన్నై వెళ్లారు. అక్కడ చికిత్స తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో మరణించారు. విజయ్ రంగరాజు అసలు పేరు ఉదయ్ రాజ్‌కుమార్. మోహన్‌లాల్ హీరోగా నటించిన 'వియత్నాం కాలనీ' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. 'భైరవద్వీపం' (1994) సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. ఆయన మహారాష్ట్ర పూణేలో జన్మించారు. ఆ తర్వాత గుంటూరుకు తరలివచ్చి అక్కడే విద్యాభ్యాసం పూర్తిచేశారు. తెలుగు, తమిళ పరిశ్రమల్లో విలన్, సహాయనటుడి పాత్రల ద్వారా మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. తెలుగులో ఐతే, యజ్ఞం చిత్రాలు విజయ రంగరాజుకు పేరు తెచ్చాయి. వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్‌లో కూడా ఆయనకు మంచి ప్రవేశం ఉంది. విలన్, క్యారెక్టర్ ఆర్టిస్టు, ఫైట్ మాస్టర్‌గా ఆయన వివిధ భాషల్లో అనేక చిత్రాల్లో నటించారు. విజయ రంగరాజు మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

'హత్య' చేసిందెవరు..?

ధన్యబాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవివర్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హత్య'. శ్రీవిద్యా బసవ దర్శకురాలు. ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హత్యా రహస్యం చుట్టూ అల్లుకున్న ఈ కథ ఆద్యంతం ఉత్కంఠను పంచుతుందని..సుధ, సలీమా పాత్రల్లో ధన్యబాలకృష్ణ, పూజా రామచంద్రన్ అద్భుతమైన నటనను కనబరిచారని దర్శకురాలు పేర్కొంది. ఈ సినిమా ద్వారా తెలుగు ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉందని పూజా రామచంద్రన్ తెలిపింది. నిర్మాణపరంగా మంచి క్వాలిటీతో తెరకెక్కించామని చిత్ర నిర్మాత ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

టోవినో థామస్, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'ఐడెంటిటీ' తెలుగులో అదే పేరుతో ఈ నెల 24న విడుదలకానుంది. మలయాళ బాక్సాఫీస్ వద్ద మంచి

థ్రిల్లర్ కథతో 'ఐడెంటిటీ'

విజయాన్ని సాధించిన ఈ చిత్రాన్ని శ్రీవేదాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ..హత్య కేసు పరిశోధన నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారని, త్రిష పాత్ర ప్రధానాకర్షణగా నిలుస్తుందని, తెలుగు ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలుంటాయని అన్నారు. మర్డర్ మిస్టరీ ఛేదించే విషయంలో ఓ ఆర్టిస్టు పోలీసులకు ఏ విధంగా సహాయం చేశాడు? చివరకు హత్యా రహస్యాన్ని ఎలా ఛేదించారనే అంశాలు థ్రిల్‌ని పంచుతాయని నటుడు వినయ్‌రాయ్ తెలిపారు. వినయ్‌రాయ్, మందిరా బేడీ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: అఖిల్ జార్జ్, సంగీతం: జేక్స్ బెజోయ్, రచన-దర్శకత్వం: అఖిల్ పాల్, ఆనాస్‌ఖాన్.

ముగ్గురు ప్రాణస్నేహితుల 'భైరవం'

బెల్లకొండ సాయిశ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. అదితిశంకర్, ఆనంది, దివ్యపిళ్లై కథానాయికలు. సోమవారం టీజర్‌ను విడుదల చేశారు. ఓ గ్రామంలో వారాహి గుడి నేపథ్యంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల చుట్టూ కథ నడిచే కథ ఇది. ఒక రికోసం ఒకరు ఎంతవరకైనా తెగిస్తారు. ఈ నేపథ్యంలో టీజర్ ఆద్యంతం ఆసక్తినిరేకెత్తించింది. చివర్లో ముగ్గురు మిత్రులు దేవుని దీవెనలు పొందుతున్నట్లుగా డివైన్ ఎలిమెంట్‌తో టీజర్‌ను ముగించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లకొండ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ.. మంచి కథాబలమున్న చిత్రమిదని, అందరికీ గుర్తింపును తీసుకొస్తుందని అన్నారు. సాయిశ్రీనివాస్, రోహిత్‌తో కలిసి నటించడం ఆనందంగా ఉందని మంచు మనోజ్ తెలిపారు. ఈ సినిమాలో తనను సరికొత్త పాత్రలో చూస్తారని నారా రోహిత్ పేర్కొన్నారు. డివైన్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ప్రేక్షకుల్ని థ్రిల్‌కు గురిచేస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమా మేకింగ్, విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉంటాయని, త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాత కేకే రాధామోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

చెట్టుకు, మనిషికి మధ్య ప్రేమకథ

ప్రముఖ దర్శకుడు సుకుమార్ తనయ సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించిన 'గాంధీ తాత చెట్టు' చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయమవుతున్నది పద్మావతి మల్లాది. ఈ సినిమా ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మల్లాది సోమవారం పాత్రికేయులతో ముచ్చటించింది. తన నేపథ్యం గురించి చెబుతూ 'నా స్వస్థలం హైదరాబాద్. పీజీ పూర్తయ్యాక చంద్రశేఖర్ యేలేటి దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశా. 'రాధేశ్యామ్'కు రచయితగా, 'మహానటి' చిత్రానికి డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశా. 'బృంద' అనే వెబ్‌సిరీస్‌కు రచయితగా పనిచేశా' అని చెప్పింది. తన స్నేహితుడు చెట్టుకు, మనిషికి మధ్య లవ్‌స్టోరీ రాస్తే బాగుంటుందని చెప్పడంతో ఆ ఐడియా నుంచి 'గాంధీ తాత చెట్టు' కథ రాసుకున్నానని, ఒక అమ్మాయి అహింసావాదంతో ఊరిని, చెట్టుని ఎలా కాపాడిందన్నదే కథాంశమని వివరించింది. ఈ సినిమాలో సందేశంతో పాటు, హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయని తెలిపింది. 'నిజామాబాద్ జిల్లాలోని రంగంపేట అనే ఊరిలో చిత్రీకరణ జరిపాం. ఈ కథ 1947లో గాంధీగారు చనిపోయినప్పుడు తాత నాటిన చెట్టుతో ప్రారంభమవుతుంది' అని పద్మావతి మల్లాది పేర్కొంది. ఈ సినిమాలో సుకృతి వేణి..గాంధీ అనే పాత్రలో కనిపిస్తుందని, సహజమైన అభినయంతో మెప్పించిందని, రెండు నెలల పాటు వర్క్‌షాప్స్ నిర్వహించి, 25 రోజుల్లో చిత్రీకరణ పూర్తిచేశామని చెప్పింది. ఈ సినిమా ద్వారా గాంధీగారి అహింస సిద్ధాంతం, మనుషులు-ప్రకృతికి మధ్య ఉండాల్సిన సంబంధం గురించి తెలియజెప్పానని ఆమె తెలిపింది.

అండర్‌వరల్డ్ 'హాంగ్‌కాంగ్ వారియర్స్'

యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన 'హాంగ్‌కాంగ్ వారియర్స్' చిత్రం ఈ నెల 24న తెలుగులో విడుదలకానుంది. లూయిస్ కూ, సమ్మోకామ్-బో-హంగ్, రిచీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఎన్‌వీఆర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నది. 'శరణార్థిగా హాంగ్‌కాంగ్‌లోకి అడుగుపెట్టిన ఓ యువకుడు తన జీవనం కోసం అక్కడి అండర్‌వరల్డ్ ప్రపంచంలోకి అడుగుపెడతాడు. ఈ నేపథ్యంలో తన మనుగడ కోసం అతను సాగించిన పోరాటమేమిటన్నదే ఈ చిత్ర కథాంశం. హాంగ్‌కాంగ్ సినీ చరిత్రలో వెయ్యి కోట్లు వసూలు చేసి సంచలనం సృష్టించింది. పవర్‌పుల్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది' అని ఎన్‌వీఆర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలిపింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana